సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 11 । జూలై । 2023



జగనన్న కాలనీల్లో కాంతులు
ఉమ్మడి జిల్లాలోని జగనన్న కాలనీల్లో విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. సీఎం జగన్ చొరవతో కాలనీల్లో విద్యుత్ ఏర్పాట్లు దాదాపు పూర్తికావొచ్చాయి. 8లో



ఉత్తమ ఆక్వా రైతుగా..
దక్షిణ భారత రాష్ట్రాల్లో ఉత్తమ చేపల రైతుగా నిడమర్రు మండలం చిననిండ్ర కొలనుకి చెందిన పల్లి భాస్కర వెంకటరామ చెల్లారావు అవార్డు అందుకున్నారు. 8లో



నేడు మినీ జాబ్‌మేళా
నూజివీడు సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహించ నున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. 8లో

వలంటీర్ల ఆగ్రహ జ్వాల

పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దిష్టిబొమ్మల దహనాలు
- మానవహారాలు.. నిరసన ర్యాలీలు
- వెల్లువెత్తిన ఆందోళనలు



పెంటపాడు: గేట్ సెంటర్ వద్ద దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి చెప్పుతో కొడుతున్న వలంటీర్లు



ఏలూరు (టూటౌన్) : ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న వలంటీర్లు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: వలంటీర్లు భగ్గుమన్నారు. వలంటీర్లను అసాంఘిక శక్తులతో పోలుస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని మండలాల్లో వలంటీర్లు రోడ్డెక్కి తీవ్రస్థాయిలో మండిపడటంతో పాటు మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహించి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. రెండు జిల్లాల్లోనూ అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగాయి. చింతలపూడిలో వలంటీర్లు నిర్వహించిన ఆందోళనకు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మద్దతు పలికి పాల్గొన్నారు. అలాగే మిగలిన ఎమ్మెల్యేలు కూడా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మండిపడి వలంటీర్ల వ్యవస్థకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా సేవలందిస్తుంటే..

ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత పారదర్శకంగా, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో వలంటీర్ల వ్యవస్థ ఏర్పడింది. ఏలూరు జిల్లాలో 10,647 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 9,532 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. తమ పరిధిలోని కుటుంబాలకు రేషన్‌కార్డు మొదలు అన్ని ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతలను వలంటీరే పర్యవేక్షిస్తుంటారు. ప్రతినెలా 1వ తేదీన ఉదయం 6 గంటలకే అర్హుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందిస్తూ దేశంలోనే రోల్‌మోడల్ వ్యవస్థగా మారారు. ఇలాంటి వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు ఇళ్లల్లోని ఆడవాళ్ల డేటాను సేకరించి అసాంఘిక శక్తులకు చేరవేస్తున్నారని, గ్రామాల్లో ఒంటరి మహిళలు, ఇతరుల వివరాలు సేకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. దీనిపై నిరసనలు మిన్నంటాయి.

ఏలూరు జిల్లాలో..

- చింతలపూడి బోసుబొమ్మ సెంటర్ వద్ద పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని వలంటీర్లకు మద్దతు తెలిపారు.
- జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం, కామవరపుకోట, కొత్తూరు గ్రామాల్లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మలకు వలంటీర్లు చెప్పులతో నిరసన తెలిపి దహనం చేశారు.
- దెందులూరు బస్టాండ్ సెంటరులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు.
- ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులో పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీలను వలంటీర్లు చెప్పులతో కొట్టి దహనం చేశారు.
- ఏలూరు అంబేద్కర్ విగ్రహం వద్ద వలంటీర్లను అవమానిస్తూ మాట్లాడారో అదే అంబేద్కర్ సాక్షిగా పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
- నూజివీడు పట్టణం, చాట్రాయి సెంటరు, ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో వలంటీర్లు నిరసన తెలిపారు.
- బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఖండించారు.



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో సచివాలయం వద్ద దిష్టిబొమ్మ దహనం

పశ్చిమగోదావరి జిల్లాలో..

- **తాడేపల్లిగూడెం పట్టణంలో ఓవర్ బ్రిడ్జి వంతెన మీద పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో, తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం,** పెంటపాడు మండలం పెంటపాడు విగ్రహాల సెంటర్‌లో వలంటీర్లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సుమారు 500 మంది వలంటీర్లు పాల్గొన్నారు. పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- ఉండి నియోజకవర్గంలో కాళ్ల మండలం దొడ్డనపూడిలో మహాత్మాగాంధీ విగ్రహానికి వలంటీర్లు వినతిపత్రం ఇచ్చారు.
- ఆకివీడులో వలంటీర్లు రాస్తారోకో నిర్వహించి నిరసన ప్రదర్శన చేసి సీఐకు ఫిర్యాదు చేశారు.
- భీమవరం నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం మండలంలో వలంటీర్లు నిరసన ర్యాలీలు చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపి పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.
- పాలకొల్లు నియోజకవర్గంలో వలంటీర్లు మానవహారం చేపట్టారు.
- యలమంచిలి మండలంలోని మేడపాడులో నిరసన ర్యాలీ చేసి పవన్‌కళ్యాణ్ బ్యానర్లను, పోస్టర్లను చించివేశారు.
- నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు ప్రదర్శన చేపట్టి సచివాలయం వద్ద ధర్నా చేశారు.



పాలకొల్లు అర్బన్: నిరసన తెలుపుతున్న వలంటీర్లు



వీరవాసరం: రాస్తారోకో చేసి నిరసన తెలుపుతున్న వలంటీర్లు

న్యూస్‌రీల్

రామశాస్త్రికి జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న చిత్రకారుడు రామశాస్త్రి

తణుకు: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అమలాపురం క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ చిత్రకళా పోటీల్లో తణుకుకి చెందిన చిత్రకారుడు, కవి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఎస్‌వీ రామశాస్త్రి ప్రతిభ చూపారు. సోమవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీఆర్ గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డును జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.సుందర్‌కుమార్, చిత్రకారులు దాకోజు శివప్రసాద్, కళాసాగర్ చేతులమీదుగా ఆయన అందుకున్నారు.

ఎంపీ నిధులు మంజూరు కాలేదు



దుర్గా రామస్వామి, పంచాయతీరాజ్ డీఈ

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరు చేయలేదని, కలెక్టర్ ఆదేశాలతో రూ.10 లక్షలతో అంచనాలు రూపొందించి నివేదిక సమర్పించామని పంచాయతీరాజ్ డీఈ ఎ.దుర్గా రామస్వామి తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ 2022–23 నిధుల నుంచి సరిపల్లిలో ఏ పనీ మంజూరు కాలేదని, శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంజీఎన్‌ఆర్‌ఈ జీఎస్ నిధుల నుంచి రూ.14 లక్షలు మంజూరవడంతో ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు. నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని, తమనెవరూ ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురిచేయడం లేదని డీఈ స్పష్టం చేశారు.

318 మి.మీ వర్షపాతం

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సోమవారం 20 మండలాల్లో 318 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుమంట్ర మండలంలో అత్యధికంగా 63.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా పెంటపాడులో 44.4, తాడేపల్లిగూడెంలో 29.6, పాలకోడేరులో 28.4, అత్తిలిలో 25.2, వీరవాసరంలో 24.2, ఇరగవరంలో 20. పాలకొల్లులో 17, పెనుగొండలో 12.2, గణపవరం మండలంలో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆకివీడు, కాళ్లలో మినహా మిలిగిన అన్నిచోట్లా వర్షం కురిసింది.

బాధ్యతతో ప్రీ ఆడిట్ విధులు



సూచనలు చేస్తున్న ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాష్

తాడేపల్లిగూడెం అర్బన్: మున్సిపల్ కార్యాలయాల్లో ప్రీ ఆడిట్ విధులను బాధ్యతతో నిర్వహించాలని ఆడిట్ విభాగం రాష్ట్ర డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్ సూచించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల ఆడిట్ అధికారులు, సిబ్బందికి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రీ ఆడిట్ నిర్వహణ నిత్యం సాగుతోందన్నారు. దీంతో బిల్లులు త్వరితగతిన ఆడిట్ చేస్తున్నారన్నారు. ప్రీ ఆడిట్ విధానాన్ని ప్రభుత్వం తొలుత దేవస్థానాల్లో ప్రారంభించగా విజయవంతం కావడంతో మున్సిపాలిటీల్లో అమలుకు ఆదేశాలిచ్చిందన్నారు. సిబ్బంది సమన్వయంతో ప్రీ ఆడిట్ నిర్వహించాలన్నారు. ఆడిట్ అధికారులు కె.వెంకటేశ్వరరావు, ఏవీఆర్ గంగాధర్, అసిస్టెంట్ ఆడిట్ అధికారులు, ప్రత్యేక అధికారి దాసరి సావిత్రి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ స్థలాలు లీజుకు ఇచ్చే అంశంపై ఔత్సాహిక వ్యాపారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజా రవాణా అధికారులు ఎన్‌వీఆర్ వరప్రసాద్, ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, కామవరపుకోట, కలిదిండి, కైకలూరు, ఆకివీడు, మార్టేరు బస్ స్టేషన్లతో పాటు భీమవరం స్టాఫ్ క్వార్టర్స్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను 15 ఏళ్ల కాల వ్యవధికి లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. విజయవాడ జోనల్ అధికారి ఆహ్వానం మేరకు బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని కో–ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ (డీసీడీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సొసైటీల్లో మౌలిక వసతులు కల్పించేలా చూడాలన్నారు. చేతి వృత్తులకు సంబంధించి వెనుకబడిన సొసైటీలకు నాబార్డు, డీసీసీల ద్వారా రుణాలను మంజూరుచేసి వాటిని రెన్యూవల్ చేయాలన్నారు. జిల్లాలో సొసైటీలన్నింటినీ కంప్యూటరైజ్ చేయాలని ఆదేశించారు. సొసైటీలను అభివృద్ధి చేసి రైతులకు మరిన్ని సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో సొసైటీలు లేని గ్రామాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లాస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఎల్ఐసీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 21 గ్రామాల్లో ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) 500 టన్నుల సామర్థ్యం గల గోడౌన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఐదు గోడౌన్లకు సంబంధించిన బిల్లులు రూ.48 లక్షల మంజూరుకు ఆమోదించారన్నారు. గోడౌన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్స్ గ్రౌండింగ్‌పై సమీక్షిస్తూ డీసీసీబీ ద్వారా త్వరితగతిన లోన్లు మంజూరు చేసి ఇప్పటికే గుర్తించి 166 యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, డీసీఓ ఎం.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పీడీ డీఆర్‌డీఏ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, సెంట్రల్ బ్యాంక్ సీఈఓ పాల్గొన్నారు.

ఆధార్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

జగనన్న సురక్ష క్యాంపుల్లో ఆధార్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జగనన్న సురక్ష, హౌసింగ్, హౌసింగ్–మౌలిక వసతులు, నాడు–నేడు పనులపై నరసాపురం సబ్ కలెక్టర్, భీమవరం ఆర్డీఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుని నిర్వహించాలన్నారు. సర్వీసు రిక్వెస్టులు, టోకన్ల రైజ్‌కు వ్యత్యాసం ఉందని, ఏరోజుకారోజు సర్వీస్ రిక్వెస్టులకు టోకెన్లను రైజ్ చేయాలన్నారు. గడువులోపు సమస్యలు పరిష్కరించాలన్నారు. వివాహ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రేషన్ కార్డులు జారీకి పక్కాగా తనిఖీలు నిర్వహించాలన్నారు. తాడేపల్లిగూడెంలో ఒకే రోజున 140 ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశామని, ఇలాగే మిగిలిన మండలాల్లో పెద్ద ఎత్తున గృహనిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. సచివాలయాల భవన నిర్మాణాలు 95 శాతానికి పైగా పూర్తయితే స్థానిక శాసనసభ్యులతో ప్రారంభోత్సవాలకు చర్యలు తీసుకోవాలన్నారు.

పవన్‌కళ్యాణ్ వలంటీర్లకు
క్షమాపణ చెప్పాలి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన వలంటీర్లకు జనసేన అధినేత, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు డిమాండ్ చేశారు. తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వలంటీర్లలో 60 శాతం మంది మహిళలే ఉన్నారనీ, వారు మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని నిందలు వేయడం పవన్‌కళ్యాణ్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. గ్రామాల్లో జరిగే ప్రేమ వివాహాలకు వలంటీర్లే కారణమనడం అవివేకమన్నారు. నిస్వార్థంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిరంతరం అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు స్క్రిప్ట్ రాస్తే పవన్‌కళ్యాణ్ సినిమా స్టైల్‌లో డైలాగులు చెబుతూ ప్రజల్లో అబాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలను ప్రతి మహిళా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. వారాహి యాత్రలో పవన్ చెబుతున్న కాకమ్మ కథలను ప్రజలు విశ్వసించడం లేదనీ, తాను అధికారంలోకి వస్తే ఏం చేస్తాడో చెప్పడం మానేసి ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. ఇకనైనా పవన్‌కళ్యాణ్ తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని శ్రీరంగనాథరాజు హెచ్చరించారు.

పోలీస్ స్పందనలో 18 ఫిర్యాదులు

ఎస్పీ రవిప్రకాష్



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 18 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ యు.రవిప్రకాష్ అర్జీదారుల సమస్యల తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించామని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- భీమవరం వన్‌టౌన్‌కు చెందిన వ్యక్తి తనను 2020లో యూనియన్ బ్యాంక్ మేనేజర్, మరికొందరు కలిసి రూ.19 లక్షల వరకు మోసం చేశారని దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చార్జిషీట్ వేయలేదని ఫిర్యాదు చేశారు.
- పోడూరుకు చెందిన మహిళ తనకు ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకుని నకిలీ వీసా పత్రాలు ఇచ్చి మోసం చేశారని ఫిర్యాదు చేసింది.
- వీరవాసరానికి చెందిన మహిళ తనకు పక్క ఇంటి వారితో సరిహద్దు గొడవలున్నాయని, దౌర్జన్యం చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు.
- మొగల్తూరుకి చెందిన మహిళ ఒక వ్యక్తి తన వెంటపడుతూ వేధిస్తుండటంతో పాటు తనకు పెళ్లి కాకుండా అడ్డుపడుతున్నాడని, రక్షణ కల్పించాలని కోరింది.
- వీరవాసరానికి చెందిన మహిళ తనను భర్త, అత్తమామలు, మరుదులు వేధిస్తుండగా గృహహింస కేసు పెట్టానని, వారంతా రాజీకి రావడంతో కేసు వాపసు తీసుకున్న తర్వాత తిరిగి వేధిస్తున్నారని ఎస్పీ వద్ద వాపోయింది.
- స్పందన కార్యక్రమం అనంతరం ఎస్పీ రవిప్రకాష్ పోలీస్ క్వార్టర్‌లో ఏర్పాటుచేసిన జిల్లా పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రిని సందర్శించారు.

లోతైన దర్యాప్తు చేస్తాం



నన్నయ్య ప్రాంగణ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీ రమేష్

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నన్నయ వర్సిటీ ప్రాగంణంలో కొందరు ఆచార్యుల అనుచిత వైఖరిపై 'సాక్షి'లో 'ఆచార్యుల తీరుతో అలజడి' శీర్షికన ప్రచురించిన కథనానికి వర్సిటీ అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీరమేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందం సోమవారం ప్రాంగణాన్ని సందర్శించారు. రమేష్ మాట్లాడుతూ ఆచార్యుల వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదులపై లోతైన దర్యాప్తు చేస్తామన్నారు. ఆచార్యులకు వ్యతిరేకంగా కొందరు, మద్దతుగా కొందరు విద్యార్థులు ఫిర్యాదులు చేశారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మరికొందరు ప్రొఫెసర్లపై అభియోగాలున్నాయని వాటిపై దర్యాప్తు చేస్తామన్నారు. సహాయ ఆచార్యుడిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేస్తామని చెప్పారు.

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం

డీఆర్వో కృష్ణవేణి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కార తీరు అర్జీదారులకు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. 187 అర్జీలు స్వీకరించారు. **అర్జీల్లో కొన్ని..**

- తన పంట పొలానికి సాగునీరు రాకుండా అడ్డుకట్ట వేసి ఇబ్బందులు పెడుతున్నారని, న్యాయం చేయాలని భీమవరం మండలం బేతపూడి శివారు యమునాపల్లికి చెందిన పైడి ఏసుపాదం అర్జీ అందజేశారు.
- నా కడుపులో కణితి ఉందని తీయిస్తానని హాస్పిటల్‌కి తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకుని తన కూతురు ఆస్తి రాయించుకుందని న్యాయం చేయాలని వీరవాసరం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బండి వనులమ్మ ఫిర్యాదు చేశారు.
- కుమారులు తనను చూడటం లేదని పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గుడిసెలో ఉంటున్నానని న్యాయం చేయాలని యలమంచిలిలంకకు చెందిన గొల్ల బంగారు లక్ష్మి కోరారు.
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, వృద్ధుల ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్ఆర్‌కేఆర్‌లో 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' చిత్ర బృందం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో మాట్లాడుతున్న 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' చిత్రబృందం

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం 'అన్నపూర్ణ ఫొటో స్టూడియో' చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర దర్శకుడు చందు ముద్దు, హీరో, హీరోయిన్స్ చైతన్య, లావణ్యలు విద్యార్థులతో డాన్స్‌లు చేసి అలరించారు. ఈ సందర్భంగా హీరోయిన్ లావణ్య మాట్లాడుతూ తాను భీమవరంలో ఇంజనీరింగ్ చదివానని, ఇక్కడ తన సినిమా ప్రమోషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు చందు, హీరో చైతన్య, నిర్మాత ఎస్.రంగినేని మాట్లాడుతూ సుమారు 80 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాలలో ఆత్మీయత, అనుబంధాలు, అప్పటి జీవన శైలి ఆధారంగా సినిమా రూపొందిందన్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు వివరించారు. ఈ నెల 21న అన్నపూర్ణ ఫొటో స్టూడియో చిత్రం థియేటర్లలో విడుదలవుందని తెలిపారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరు బాలుడు ఎస్.అచ్యుత్ విశ్వనాథ్ ప్రతిభ చాటాడని కోచ్ ఘంటా వెంకటశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకూ రాజమండ్రిలో అంతరజిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయని.. విశ్వనాథ్ అండర్-11 విభాగంలో కాంస్య పతకం సాధించాడని వివరించారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ కాంతులు

- ఉమ్మడి జిల్లాలో 909 కాలనీల్లో విద్యుదీకరణ పూర్తి
- లో ఓల్టేజ్ పరిష్కారానికి 4,755 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ఆకివీడు గాలిబ్ చెరువు వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణం



తాళ్లకోడు జగనన్న కాలనీలో విద్యుత్ కాంతులు

ఆకివీడు: ఉమ్మడి జిల్లా జగనన్న కాలనీల్లో కరెంట్ కాంతులు విరజిమ్మనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యలతో కాలనీల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు దాదాపు పూర్తి కావొచ్చాయి.

మరో పది, పదిహేను రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఏర్పడింది. ఇటీవల వర్షాలకు విద్యుదీకరణ పనులకు కొంత అంతరాయం ఏర్పడినప్పటికీ, పనులు మళ్లీ వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ సిబ్బంది అహోరాత్రులు పనిచేస్తూ కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 953 జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతుంది. ఇళ్ల స్థల పట్టాలు అందుకున్న పేదలు ప్రభుత్వం అందజేసే రూ.1.80 లక్షలతో పాటు, కొంత సొంత సొమ్ము జమ చేసుకుని నిర్మాణ పనుల్ని వేగవంతం చేశారు. వేగంగా పేదల ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించడంతో ఇప్పటి వరకూ 909 కాలనీల్లో విద్యుదీకరణ పనుల్ని పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో కాలనీలతో పాటు ప్రజలకు పుష్కలంగా విద్యుత్ సరఫరా చేసేందుకు 12 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు. 33/11 కేవీ సబ్ స్టేషన్లను వేగవంతంగా నిర్మించే చర్యల్లో భాగంగా ఇప్పటి వరకూ మూడు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. కుప్పనపూడి, నిడమర్రు, తొరిమెళ్ల గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి అయింది.

లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి..

ఉమ్మడి జిల్లాలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవిలో లోఓల్టేజ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లోనూ, గ్రామాల్లో పట్టణాల్లో మొత్తం 4,775 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించింది. దీంతో వేగంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.

వేగంగా పనులు



విద్యుత్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. లోఓల్టేజ్ సమస్యతో పాటు, కాలనీల్లో విద్యుదీకరణ పనుల్ని వేగవంతం చేశాం. ఉమ్మడి జిల్లాలోని కాలనీల్లో 91 శాతం పనులు పూర్తయ్యాయి. వర్షాల వల్ల కొద్ది జాప్యం జరిగినప్పటికీ మళ్లీ వేగంగా పనులు జరుగుతున్నాయి.

– పి.సాల్మన్‌రాజు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ

రెండు నెలల క్రితమే విద్యుత్ కనెక్షన్



కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో ఇచ్చిన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకున్నాం. అద్దె ఇంటి బాధలు తప్పాయి. సొంత ఇంట్లో ఉంటున్న ఆనందం చెప్పలేనిది. రెండు నెలల క్రితం ఉచితంగా కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. విద్యుత్ సౌకర్యంతో అన్ని వసతులూ కలిగాయి. రోడ్డు నిర్మిస్తే సరిపోతుంది.

– అంకాని కుమారి, గృహిణి, తాళ్లకోడు, ఆకివీడు మండలం

108 వాహనంలో మహిళ ప్రసవం



108లో జన్మించిన చిన్నారితో అంబులెన్స్ సిబ్బంది

కుక్కునూరు: గర్భిణిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రసవించింది. 108 సిబ్బంది ఆమెకు ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడారు. ఈ ఘటన సోమవారం మండలంలోని మారేడుబాకలో జరిగింది. మండలంలోని గుండుగూడెంకు చెందిన కుంజా వెంకటమ్మకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అంబులెన్స్‌లో కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు భద్రాచలం ఆసుపత్రికి రిఫర్ చేశారు. కుక్కునూరు నుంచి భద్రాచలం తరలిస్తుండగా మధ్యలో మారేడుబాక వద్ద పురిటినొప్పులు ఎక్కువవడంతో ఈఎంటీ అజిత్ వాహనాన్ని పక్కకు ఆపిం పైలెట్ అనిల్, ఆశా వర్కర్ వీరలక్ష్మి సాయంతో మహిళకు ప్రసవం చేశారు. వెంకటమ్మ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బందికి వెంకటమ్మ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణలో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి?

కుక్కునూరు: పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుండగా కొందరు ఉద్యోగుల బాధ్యతా రాహిత్యం కారణంగా అమ్మ ఒడి పథకం పక్కదారి పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంత రాష్ట్ర సరిహద్దులో ఉన్న గ్రామాల్లో ఉంటున్న మండలానికి చెందిన విద్యార్థులు తెలంగాణకు చెందిన విద్యా సంస్థలలో చదువుకుంటుండగా వారి పేర్లను మండలానికి చెందిన పాఠశాలలో నమోదు చేసి అమ్మ ఒడి జమ చేయించుకున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనికి సంబంధించి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కావాలనే విద్యార్థుల పేర్లను తను విధులు నిర్వహిస్తున్న పాఠశాలలో నమోదు చేయించాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు విచారణ జరిపితే పలు అవకతవకలు బయటపడతాయని అంటున్నారు.

పవన్ వ్యాఖ్యలపై విచారణ జరిపించాలి



భీమవరంలో ఎస్పీ రవిప్రకాష్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ఆరోపణలు నిరాధారమైనతే కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు అధ్యక్షుడు కటికతల రాజారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ సభ్యురాలు జిల్లెళ్ల సుధామ ఎస్పీ యు.రవిప్రకాష్‌ను కోరారు. సోమవారం భీమవరంలో ఎస్పీని కలిసి వినతి పత్రం అందచేశారు. వలంటీర్ల వ్యక్తిత్వాన్ని కించపర్చేలా పవన్ కల్యాణ్ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ వ్యాఖ్యలపై తక్షణం విచారణ జరిపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మరోసారి వీసీగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో ఒక అధ్యయన కేంద్రంగా ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని కొనసాగిస్తూ, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుచేసుకోవాలని గవర్నర్ సూచించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ.స్వామి, పీఆర్‌ఓ రత్నకిషోర్‌లు ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభకు అజయ్ చంద్రాక్య



గ్రంధి అజయ్ చంద్రాక్య

పెనుగొండ: ప్రపంచ ఆర్య వైశ్య మహాసభకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పెనుగొండ గ్రామానికి చెందిన గ్రంధి అజయ్ చంద్రాక్య ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో కర్నూలులో జరిగిన సభలో చంద్రాక్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

సౌతిండియా ఉత్తమ ఆక్వా రైతుగా చెల్లారావు



కోల్‌కతాలో సోమవారం సౌత్ ఇండియా ఉత్తమ రైతుగా అవార్డు అందుకుంటున్న చెల్లారావు

కైకలూరు: దక్షిణ భారత రాష్ట్రాలలో ఉత్తమ చేపల రైతుగా ఏలూరు జిల్లా నిడమర్రు మండలం చిననింద్రకొలనుకు చెందిన పల్లి భాస్కర వెంకటరామ చెల్లారావు ఎన్నికయ్యారు. సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఎఫ్ఆర్ఐ) నిర్వహణలో సోమవారం కోల్‌కతా సమీపంలోని బర్రక్‌పూర్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రైతు చెల్లారావు బీటెక్ చదివి ఆక్వా రైతుగా మారారు. 23 ఎకరాల్లో కట్లా, బొచ్చె, రాగండి చేపలను సాగు చేస్తున్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులు గుర్తించిన మత్స్యశాఖ అధికారి విద్యాసాగర్ ఆన్‌లైన్‌లో ఆయన వివరాలు నమోదు చేశారు.

క్షీరారామలింగేశ్వరస్వామికి పండ్లతో అలంకరణ



వివిధ రకాల పండ్లతో క్షీరారామలింగేశ్వరస్వామికి అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఉదయం భక్తులు స్వామికి అభిషేకాలు, జనార్దనస్వామికి అర్చనలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి పంచహారతుల కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అవమానంపై ఆగ్రహం

దెందులూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కాళ్ళతో తన్నిన జనసైనికులు, పవన్‌కల్యాణ్ ఏలూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద క్షమాపణ చెప్పకపోతే దేశవ్యాప్తంగా దళితులు, బహుజనులు, గిరిజనుల ఆగ్రహాన్ని చవి చూడడమే కాకుండా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని మానవహక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, ఎమ్మార్పీఎస్ దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు కే.మురళీ అన్నారు. సోమవారం గాలాయగూడెంలో నాయకులు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ప్రతి మాటలోనూ చరిత్రకారుల గురించి వారి గొప్పతనం గురించి ప్రస్తావిస్తారని, అంబేడ్కర్ విగ్రహాన్ని కాళ్ళతో తన్నుతూ జనసైనికులు విగ్రహంపైకి ఎక్కి కూర్చొంటే పవన్ ఎటు చూస్తున్నారని, అంబేడ్కర్ విగ్రహం కనపడలేదా అని ప్రశ్నించారు. గతంలో పార్లమెంట్ లోపలికి వెళ్ళి ఎంపీలు గోడలు చూస్తున్నారా... అని ప్రశ్నించిన పవన్ అంబేడ్కర్ విగ్రహం కళ్లజోడు ఉన్నా ఎందుకు కనిపించలేదన్నారు. జనసైనికులు, పవన్‌కళ్యాణ్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చి క్షమాపణ చెప్పి పాలాభిషేకం చేయకపోతే అట్రాసిటీ కేసు పెడతామని గొల్ల కిరణ్ హెచ్చరించారు.

నేడు రాష్ట్ర స్థాయి దైవ సేవకుల సదస్సు

ఏలూరు (టూటౌన్): ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి దైవ సేవకుల సదస్సు ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.జీవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దైవ సేవకులు ఈ సదస్సులో పాల్గొనాలని ఆయన కోరారు. సదస్సును విజయవంతం చేయాలని అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రత్నప్రసాద్, కార్యదర్శి కె.మేభేల్ బాబు, కోశాధికారి పాస్టర్ సీహెచ్ జోసఫ్‌లు పిలుపునిచ్చారు.

క్షణికావేశంలో బలవన్మరణం

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

పాలకోడేరు: మధ్యవర్తిగా ఉండి ఇప్పించిన అప్పులు వసూలు కాకపోవడం, బాకీ ఇచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోవడంతో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. విస్సాకోడేరు గ్రామానికి చెందిన రాజేష్ కుమార్ భీమవరం పట్టణానికి చెందిన కలిదిండి శ్రీనివాసరాజు, ఉమ్మడి సింగ్ ఏసుబాబులకు రూ.11.50 లక్షలు సొంత పూచీకత్తుపై అప్పులు ఇప్పించాడు. అప్పులు తీసుకున్న ఇద్దరూ వాటిని తిరిగి చెల్లించకపోవడంతో రుణదాతలు రాజేష్ కుమార్‌పై ఒత్తిడి తెచ్చారు. తీసుకున్న అప్పులు తీర్చాలని, లేకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని రాజేష్ కుమార్ ప్రాధేయపడినా శ్రీనివాసరాజు, ఏసుబాబులు సరిగా స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. . నువ్వు చనిపోతే మాకేంటని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని.. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆదివారం సాయంత్రం తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

యలమంచిలి మండలంలో ఒకరు

యలమంచిలి: యలమంచిలి పంచాయతీ గొల్లేపరచెరువుగట్టు ప్రాంతానికి చెందిన నేలపాటి శ్రీను (43) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై జాజుల విజయ నాగ ప్రసాద్ తెలిపారు. మృతుడు శ్రీను భార్య మూడు నెలల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. శ్రీను ముగ్గురు కుమార్తెలు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న శ్రీను మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెదవేగి: ఇంటర్ ఫెయిలవడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన గెద్దల బన్ను ఇంటర్ ఫెయిల్ అవడంతో అయిష్టంగా ఐటీఐలో చేరాడు. కొద్ది రోజులుగా మనస్తాపంగా ఉన్న అతను జూన్ 21న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బన్ను సోమవారం మృతిచెందాడని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు నూజివీడులో మినీ జాబ్‌మేళా

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న నూజివీడులో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి పట్టణంలోని శ్రీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో టెక్నోటాస్క్ సొల్యూషన్స్, మోహన్ స్పింటెక్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. దాదాపు 200 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తారని, పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత ఉండి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9652503799, 8374039719 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

14న జాబ్ మేళా

ఆకివీడు: స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో పేరొందిన 13 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని చెప్పారు. కియా, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, అమరరాజా, ముత్తూట్ వంటి సంస్థలున్నాయన్నారు. ఆయా సంస్థలో సుమారు 800 ఉద్యోగాలున్నాయని, వాటికి ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఇతర వివరాలకు 86885 94244 నెంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో సీపీడీసీ డాక్టర్ పీబీ.ప్రతాప్‌కుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు పి.గోపాలకృష్ణంరాజు, లయన్స్ అధ్యక్షుడు వేగేశ్న వెంకట కృష్ణంరాజు, దాసరి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి అనిల్‌కుమార్‌ని కలసిన ఎమ్మెల్సీ వంకా



మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తణుకు టౌన్: మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను శాసన మండలి సభ్యుడు వంకా రవీంద్రనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో కలసిన పుష్పగుచ్ఛం అందించారు. పలు అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు రవీంద్రనాథ్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యాగర్లపల్లిలో నీటి నిల్వ ప్రదేశాలను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తాడేపల్లిగూడెం: జ్వరాలపై అపోహలు వద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు కోరారు. 50వ విడత ఫీవర్ సర్వేలో భాగంగా సోమవారం డెంగ్యూ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని యాగర్లపల్లి 20, 24, 25 వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా వంటి సమచారాన్ని ఆరోగ్య బృందాలకు అందించాలని కోరారు. జ్వరాలను తొలిదశలో గుర్తించడం ద్వారా వైద్యం సులభతరం అవుతుందన్నారు. ఫ్రైడే డ్రైడేగా ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. దోమలు అభివృద్ధి చెందే ప్రాంతాల్లో కీటక నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆరోగ్యసహాయకులు, ఆశలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

పెంటపాడు: చెడు వ్యసనాలకు లోనై అప్పుల బాధ తాళలేక ప్రత్తిపాడులో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది. పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..అత్తిలిలోని మసీదురోడ్డుకు చెందిన బోడపాటి శ్రీనివాస్ కుమారుడు అయిన దుర్గా ప్రసాద్ లక్ష్మణరావు(26) ప్రత్తిపాడు జాతీయ రహదారి పక్కన ఇసుకర్యాంప్ సమీపంలో రేకుల షెడ్డులో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకొంటున్నాడు. అయితే కుమారుడు దుర్గా ప్రసాద్ లక్ష్మణరావు గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు లోనయ్యాడు. ఈ క్రమంలో పలువురి దగ్గర అప్పులు చేశాడు. అప్పుల వాళ్లు బాకీ అడగడంతో భాధ భరించలేక ఆ షెడ్డులో నుంచి జూన్ 19న ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయినట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపాడు. మరలా ప్రత్తిపాడులోని రేకుల షెడ్డుకు వచ్చిన దుర్గాప్రసాద్ లక్ష్మణరావు సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై జి. సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా కన్వీనర్‌గా రమణారావు

భీమవరం అర్బన్: మండలంలో కొవ్వాడ అన్నవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న పీవీఎస్ఎస్‌బీ రమణారావును ఏపీటీఎఫ్1938 అసోషియేషన్ జిల్లా శాఖ కన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి నియామకం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా నూతన కన్వీనర్‌గా నియమితులైన రమణారావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. రమణారావును పలువురు ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

వెల్లువెత్తుతున్న నిరసన జ్వాలలు



పెంటపాడులో దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం సచివాలయం-1 వద్ద పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ డౌన్ డౌన్....అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందని, అటువంటి వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా పవన్ కల్యాణ్ చిత్రీకరించడం దారుణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల్ని నిర్బంధించడం వల్ల వైరస్ వ్యాప్తి కట్టడి చేయగలిగామన్నారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. మండలంలో 27 గ్రామాల నుంచి 520 మంది వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల వాఖ్యలపై పవన్ క్షమాపణ చెప్పాలి

పెంటపాడు: ఏలూరు సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వాఖ్యలను తక్షణం వెనుకకు తీసుకొని వారికి క్షమాపణ చెప్పాలని పెంటపాడు మండల గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం పెంటపాడు గేట్ సెంటర్‌లో పవన్ కల్యాన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి పాడె మోశారు. ఏలూరు సభలో మహిళా వలంటీర్లను కించపరిచే విధంగా ఉన్న వాఖ్యలు తక్షణం వెనుకకు తీసుకోక పోతే ఆయన సభను అడ్డుకొని నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన సత్యముత్యప్రసాద్‌రెడ్డి కర్రి పృధ్వీకుమార్‌రెడ్డి (పెంటపాడు), సుంకర సత్యకూనయ్య(పరిమెళ్ల)లు మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సేవాభావంతో కరోనా సమయంలోనూ, ప్రజలకు ప్రతీ నెలా 1న టంఛన్‌గా పింఛన్ అందించి అవ్వా తాతల చిరునవ్వు చూస్తున్న వలంటీర్లపై అనుచిత వాఖ్యలు పవన్ కల్యాణ్‌కు తగదన్నారు. వలంటీర్ల వ్యవస్థతోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్న అక్కసుతో జనసేన నేత పవన్ ప్రవర్తించి హద్దులు దాటటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండు మోగుల సాంబయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, గృహసారథుల కన్వీనర్ మైలవరపు పెదబాబు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, పెంటపాడు గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, సర్పంచ్‌లు కట్టా దానయ్య, భావన ధాన్యలక్ష్మి, గొర్రెల కోటేశ్వరరావు, గోకా వెంకటేశ్వరరావు, దర్శిపర్రు ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, ఇందుకూరి నాగరాజు, మట్టా సత్యనారాయణ, కాసారపు శ్రీను, మిరియాల భాస్కరరావు, మేడపురెడ్డి బొమ్మినాయుడు, నిమ్మల పెదకాపు, నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వలంటీర్లను అవమానించడం తగదు



కోవిడ్ సమయంలో ప్రజలకు సేవలందించిన వలంటీర్లను అవమానించే విధంగా పవన్ వ్యాఖ్యలు చేయడం సరికాదు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, అప్పటి వరకు ధర్నా ఆపేది లేదని స్పష్టం చేశారు.

– మీసాల భవానీ, మాధవరం, తాడేపల్లిగూడెం మండలం

పవన్ అవగాహన రాహిత్యానికి నిదర్శనం



సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా వ్యాఖ్యానించడం ఆయన రాజకీయ అవగాహన రాహిత్యానికి నిదర్శనం. గ్రామంలోని ప్రతీ కుటుంబంలోనూ కుటుంబ సభ్యుల మాదిరిగా ఉంటూ వారికి సేవలందిస్తున్నాం. అటువంటి వలంటీర్లు ఒంటరి మహిళలను ట్రాప్ చేస్తున్నారనడం ఆయన విజ్ఞతకు నిదర్శనం. వలంటీర్లకు వెంటనే క్షమాపణ చెప్పాలి.

– పెండెం పవన్‌కుమార్, బంగారుగూడెం, తాడేపల్లిగూడెం మండలం

వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తణుకులోని ఎస్ఎస్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సిర్రా ప్రదీప్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అప్పలస్వామి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలన్నారు. అనంతరం కళాశాల నూతన కమిటీను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్కా కృపావరం, కార్యదర్శిగా బొల్లం శ్రీధర్, బాలికల కమిటీ అధ్యక్షుడిగా కె.ప్రణుతి, కార్యదర్శి కె.పావనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జి.పవన్, బి.వీర్రాజు, నాయకులు కె.వెంకట నరేష్, ఎ.జాన్సీ, డి.రమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ షాపుల వేలానికి నోటిఫికేషన్ జారీ

తాడేపల్లిగూడెం: గూడెం ఆర్టీసీ ప్రాంగణ పరిధిలో దుకాణాలు అద్దెకు ఇస్తున్నామని ఆసక్తి గలవారు సంప్రదించాలని సోమవారం డిపోమేనేజర్ యేలూ రి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆటోమొబైల్స్, సానిటరీ వస్తువులు గోదాము, గృహోపకరణాలు, లేజర్ కటింగ్ వర్కుషాపు, కూల్ డ్రింక్స్ జనరల్ స్టోర్సు, ఏసీ రిఫ్రిజిరేటర్స్ దుకాణం అద్దెకు ఇస్తామని, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను భీమవరం జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో 19వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు.

ఆర్బీకేలు రైతు నేస్తాలు

- నాలుగేళ్లుగా విశేష సేవలు
- సొంత గ్రామాల్లోనే రైతులకు అన్నీ లభ్యం
- విత్తు నుంచి విక్రయం దాకా అన్నదాతకు ఆసరా



రామచంద్రపురం రైతు భరోసా కేంద్రం

పెంటపాడు: ఒకప్పుడు రైతులన్నా, వారు పడుతున్న కష్టాలన్నా ఎవరికీ పట్టేదికాదు. ఏ సమయంలో ఏ పంట వేయాలి, ఏరకం విత్తనాలు, భూసార పరీక్షలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు తదితర సమాచారం అందుబాటులో లేక ఆయోమయంలో ఉండే పరిస్థితి ఆనాటి అన్నదాతది. నేటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్నదాతకు అండగా నిలబడ్డారు. పంట నాటింది మొదలు, చేతికి వచ్చిన పంటను అమ్మి సొమ్ము చేసుకొనే వరకు ప్రతీ దశలో ఎప్పుడు ఏ అవసరమైన సమాచారం కావాలన్నా నేనున్నానంటూ నిలబడి రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లు ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారాయి. మండలంలో 21 గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలుఉన్నాయి. వాటిద్వారా మండలంలోని 24 వేల ఎకరాల రైతులకు సేవలు అందుతున్నాయి.

అన్ని రకాల సేవలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం రైతులు సొంత ఊరిలోని ఆర్బీకేలనే రైతులు ఆశ్రయించి సమగ్ర సమాచారం పొందుతున్నారు.

కియాస్క్‌తో ఎన్నో ప్రయోజనాలు:

రైతుల కోసం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా సబ్సీడీ ఎరువుల, విత్తనాలను 48 గంటల్లోనే వీఏఏల ద్వారా రైతులకు తక్షణం అందజేస్తున్నారు. గతంలో విత్తనాల కోసం రైతులు ఎన్నో పాట్లు పడాల్సివచ్చేది. ప్రస్తుతం సబ్సీడీపై ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు, ట్రాక్టర్లు, గడ్డికోత యంత్రాలు, కోత మిషన్, నాట్లు వేసే యంత్రం తదితర పనిముట్లు పంపిణీ చేస్తున్నారు. ఏ తెగులుకు ఏ మందు వాడాలో తెలియజేప్పేందుకు వీలుగా ఈ యంత్రాల్లో రైతు కాలెండర్‌ను పొందు పరిచారు. దీని వల్ల రైతులు ఇష్టాను సారంగా పురుగు మందులు వాడకుండా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకొంటున్నారు. ప్రకృతి విపత్తులు, తుఫానుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా ఈ క్రాప్ బుక్కింగ్, పంట నష్ట పరిహారం ప్రతీ రైతు పొందేలా ఏర్పాటు చేశారు. ఈ క్రాఫ్ ధ్రువపత్రం ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందజేస్తున్నాయి.

ఈ క్రాఫ్ బుక్కింగ్‌తో ఎంతో మేలు

రైతులకు ఆయా సీజన్‌లలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయి. సీజన్లతో సంబంధం లేకుండా అన్నీ రైతులకు దొరుకుతున్నాయి. మార్కెట్ ధరకన్నా ఆర్బీకేల్లో విత్తనాలు, తక్కువ ధరకే దొరుకుతున్నాయి.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఈ క్రాఫ్ బుక్కింగ్ వల్ల రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంది. ప్రస్తుతం ఆర్బీకేల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, విత్తనా లను అందుబాటులో ఉంచుతోంది. సీజ న్లతో సంబంధం లేకుండా అన్నీ దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్బీకేలో ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకే దొరుకుతున్నాయి. పంటల భీమా పథకం కింద నష్టపరిహారం రావడం పట్ల సీఎం జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– కె. సత్యనారాయణ కౌలు రైతు, వెస్ట్ విప్పర్రు

రైతులకు మరిన్ని సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తున్నాం. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ సీజన్‌లోనూ సేవలందిస్తున్నాం. ఆర్బీకే సేవలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలి

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

- మహిళా సమాఖ్య ఆత్మీయ సభలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



ఆకివీడు మహిళా సమాఖ్య భవనంలో సన్మాన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: మహిళలు ఆర్థికశక్తిగా ఎదిగినప్పుడే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మరింత పెరుగుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సభలో భవన నిర్మాణ దాతలకు సత్కారం చేశారు. అనంతరం మహిళలనుద్దేశించి పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుండాలంటే మహిళ ఆర్థికంగా ఎదగాలన్నారు. కుటుంబాలు బాగుపడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తి రక్షణ ఉందన్నారు. మహిళా పక్షపాతిగా ఉన్న సీఎం వైఎస్ జగన్ స్త్రీనిధి పెంపు, సున్నా వడ్డీ, రుణ మాఫీ వంటివి అమలుజేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పేరుతో సెంటిమెంట్‌గా వాడుకోవాలని చూశారని ఆరోపించారు. చంద్రబాబు కుట్రల్ని మహిళలు గుర్తించి జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేశారన్నారు. మళ్లీ, మళ్లీ సీఎంగా జగన్ చేసేందుకు, మహిళా అభివృద్ధికి, మహిళా స్వేచ్ఛకు మహిళలంతా కలిసి దీవించాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌ను మహిళలు మరిచిపోకూడదన్నారు. నాలుగేళ్ల పాలనలో పొందిన లబ్ధిని గుర్తించి మద్దతివ్వాలన్నారు. మహిళాసమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్‌లు నల్లపురాజు రామారాజు, చిట్టిబాబు, నాతిరెడ్డి ఆదిలక్ష్మీ అన్నవరం, కార్యదర్శి పొలిపిరెడ్డి కనకదుర్గ, ఏపీఎం నాగభూషణం నాయుడు, పుప్పాల పండు పాల్గొన్నారు.

సత్ఫలితాలనిస్తున్న జగనన్న సురక్ష



వేల్పూరు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

తణుకు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వివిధ సేవల కోసం అర్హులను గుర్తింపులో తణుకు మండలంలోని పలు గ్రామ సచివాలయాలు ముందు వరసులో ఉన్నాయి. గత పక్షం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 ధ్రువ ప్రతాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి అనంతరం నిర్వహించే గ్రామ సభల ద్వారా ధ్రువ పత్రాలను అందజేస్తున్నారు. తణుకు రూరల్ మండలంలో సోమవారం సాయంత్రానికి వేల్పూరు 3వ సచివాలయం పరిధిలో మొత్తం 1808 నివాస గృహాలకు ఉండగా వాటిలో 1574 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు సందర్శించి 3172 టోన్‌లు జారీ చేశారు. దీనిలో 2816 సేవలను అప్లోడ్ చేసినట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తెలిపారు. దువ్వ 2వ సచివాలయం పరిధిలో మొత్తం 1585 నివాస గృహాలు ఉండగా వాటిలో 1372 గృహాలను సందర్శించి 1663 టోకెన్‌లను అందజేశారు. 1550 సర్వీసులను అప్లోడ్ చేసినట్లు తెలిపారు. వేల్పూరు 4 సచివాలయం పరిధిలో మొత్తం 1638 నివాస గృహాలు ఉండగా వాటిలో 1,023 గృహాలను సందర్శించి 1625 టోకెన్‌లు అందజేశారు. 1496 సర్వీసులను అప్లోడ్ చేసినట్లు తెలిపారు. తేతలి 1 సచివాలయంలో 1,397 గృహాలకు గానూ 892 గృహాలను పూర్తి చేసి 1204 టోకెన్‌లు జారీ చేశారు. వాటిలో 1024 సర్వీసులను అప్లోడ్ చేశారు. సచివాలయాల పరిధిలో మొత్తం నివాస గృహాలను సందర్శించి టోకెన్‌లు జారీ చేయడంలోనూ, సర్వీసులను అప్లోడ్ చేయడంలోనూ మండలంలోని వేల్పూరు 3 సచివాలయం జిల్లాలోనే ప్రథమ స్థానానికి చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదే విధంగా వివిధ సర్టిఫికేట్‌లు జారీ చేయడంలో కూడా వేల్పూరు సచివాలయం జిల్లాలోనే ముందున్నట్లు పేర్కొన్నారు.

గీత కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలి

సాక్షి, భీమవరం: గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.5 వేల కోట్లు కేటాయించి రాష్ట్రంలో వృత్తి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం భీమవరం డివిజన్ కల్లుగీత సొసైటీ అధ్యక్షులు, గీత కార్మికుల విస్తృత సమావేశం కడలి పాండు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నర్సింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలని, గీతవృత్తి ఆధునికీకరణకు నిపుణులతో అధ్యయన కమిటీ వేయాలని, ప్రమాదాలను నివారించడానికి సేఫ్టీ మోకులు ఇవ్వడంతోపాటు నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు పెట్టి కల్లుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా సహాయక కార్యదర్శి బొక్కా చంటి, చింతపల్లి వీరాస్వామి, కాగిత రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు వేలం నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై బి. మోహన్‌రావు సోమవారం చెప్పారు. 2020-2021కు సంబంధించి మద్యం కేసుల్లో పట్టుబడ్డ రెండు ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామని తెలిపారు.

నటుడు సుమన్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



భీమవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: నటుడు సుమన్ క్రైస్తవులు, ముస్లింలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం దళిత ఐక్యవేదిక, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ హీరో సుమన్ క్రైస్తవులను, ముస్లింలను కించపర్చేలా మాట్లాడడం దారుణమన్నారు. సుమన్ వ్యాఖ్యలు కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నాయని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాలపర్తి జోనా, పట్టెం శుభాకర్, ఆలమూరి బాబ్జి, గొల్ల రాజ్‌కుమార్, ఎండీ మున్వర్, షకీల్, ఖలీల్, అహ్మద్, పి.సహదేవరాజ్, కర్రా కల్యాణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

సాక్షి, భీమవరం: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 36 గంటల అంగన్‌వాడీల ధర్నా సోమవారం ప్రారంభమైంది. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే ఝాన్సీ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మాతా శిశు సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,. ప్రస్తుతం వారికి ఇస్తున్న వేతనం పెరిగిన ధరలతో పోలిస్తే చాలడం లేదన్నారు. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.